క్లుప్తంగా

31వ తేదీ లోగా పంట రుణాలు చెల్లించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు తీసుకున్న పంట రుణాలను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని ఎస్.ఎం.పురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు బుధవారం తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించి రెన్యువల్ చేసుకుంటే నాలుగు శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుందన్నారు. సకాలంలో చెల్లించకపోతే ఏడు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలు తమ సిబ్బంది ద్వారా, లేదంటే నేరుగా ఎచ్చెర్లలోని కార్యాలయంలో కూడా చెల్లించవచ్చునన్నారు.

గొలివివానిపేటలో పొలంబడి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది లక్ష్మునాయుడు మాట్లాడుతూ.. పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కషాయాలు పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లను నియంత్రించగలమని వివరించారు. అంతర పంటలు, తృణధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించవద్దని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గొలివి రామకృష్ణ, సిమ్మయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పరామర్శలో సాయికుమార్ తదితరులు

లావేరు: పైడయ్యవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పీరుకట్ల అప్పలనాయుడు చిన్నాన్న అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియడంతో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, నాయకులు ఇసర్ల సూర్యారావు, దొండపాటి వాసు, చింతాడ భాస్కరరావు, వలిరెడ్డి భాను, అల్లివలస మాజీ సర్పంచ్ దుమ్ము పండోడు తదితరులు పైడయ్యవలస గ్రామానికి బుధవారం వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

తగ్గిన ఉల్లి పంట సాగు




లావేరులో సాగులో ఉన్న ఉల్లిపంట

లావేరు: మండలంలో ఉల్లిపంట సాగు ఈ ఏడాది బాగా తగ్గింది. లావేటిపాలెం, లావేరు, కేశవరాయునిపురం, జీజీవలస, అప్పాపురం, రామునిపాలెం, గోవిందపురం, ఇజ్జాడపాలెం, పట్నువానిపేట, తామాడ, లింగాలవలస, పోతయ్యవలస, వెంకటాపురం, లుకలాపుపేట గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉల్లిని రైతులు సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది సాగు విస్తీర్ణం 50 ఎకరాలకే పరిమితమైంది. తెగుళ్ల కారణంగా నారు దశలోనే చనిపోవడంతో పాటు పంటకు కూడా వివిధ తెగుళ్లు వ్యాపించాయి. అలాగే కూలీల కొరత కారణాలతో సాగును తగ్గించినట్టు రైతులు చెబుతున్నారు.

ఐదుగురు జూదరులపై కేసు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరివానిపేటలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్లు సీఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పట్టుబడిన ఐదుగురు జూదరుల నుంచి రూ.1,30,450 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చీరే రక్షణ కంచె



మిరప పంట చుట్టూ చీరలతో కంచె వేసిన దృశ్యం

జి.సిగడాం: సాధారణంగా పంటల రక్షణ కోసం రైతులు ముళ్ల కంచె ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఇటీవల రైతులు వినూత్నంగా ఆలోచన చేస్తున్నారు. ముళ్ల కంచెకు బదులుగా పాత చీరలను పొలం చుట్టూ కంచెగా ఏర్పాటు చేయడం అలవాటు చేసుకున్నారు. ఇలా చేయడం ద్వారా పిచ్చికలు, కాకులు, ఇతర జంతువులు పంటజోలికి రాకుండా ఉంటాయని చెబుతున్నారు. మధుపాం–కప్పరాం గ్రామాల మధ్యలో మిరప చేనుకు చీరలనే కంచెగా ఏర్పాటు చేసిన దృశ్యమే ఇది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- వెల్పురాయిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకపాలన అందిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వెల్పురాయి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 325 గడపలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి సంబంధిత బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాలువలు నిర్మించాలని, పక్కా ఇళ్లకు రుణాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులను పిలిచి పనులు త్వరగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పార్టీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, బడి రాంబాబు, మహిళ మండలి అధ్యక్షురాలు గురాన మానస, వెల్పురాయి ఎంపీటీసీ సభ్యురాలు గురాన కన్నమ్మ, గ్రామ నాయకులు కెల్ల రామకృష్ణ, గురాన ప్రసాద్, మీసాల రామకృష్ణ, గురాన మహేష్, యలకల అప్పలనాయుడు, నాగేశ్వరరావు, పిన్నింటి చక్రధర్, కెల్ల కృష్ణారావు, గులివిందుల కన్నప్పుడు, మీసాల శ్రీనివాసరావు, రామునాయుడు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ



తహసీల్దార్లతో మాట్లాడుతున్న మురళీ కృష్ణ

రణస్థలం: ఓటర్ కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధానం శతశాతం జరగాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పి.మురళీకృష్ణ అన్నారు. రణస్థలంలోని రెవెన్యూ కార్యాలయంలో నాలుగు మండలాల తహసీల్దార్లతో ఓటర్ నమోదు ప్రక్రియ, జాబితా, ఆధార్ అనుసంధానంపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆధార్ అనుసంధానం 75 శాతం పూర్తయిందని..మిగిలిన 25 శాతం శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,37,999 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1,77,722 మంది ఓటరు కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకున్నట్టు పేర్కొన్నారు. మిగిలిన 58,743 మంది ఓటర్లు ఆధార్‌ను అనుసంధానం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉన్నందున 18 ఏళ్లు నిండినవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా బూత్ లెవెల్ అధికారులు చర్య తీసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ నమోదు, జాబితా ప్రదర్శన, ఆధార్ అనుసంధానం, చేర్పులు, మార్పులు వంటి ఏర్పాటు కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. అనంతరం కొవ్వాడ గ్రామంలోని అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల తహసీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి, పప్పల వేణుగోపాల్, ఇ.సత్యనారాయణ, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆక్రమణలు గుర్తించి తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి తక్షణమే తొలగించాలని శ్రీకాకుళం తహసీల్దార్ ఎన్.వెంకట్రావు సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వార్డు సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల భూముల విలువ పెరగడంతో ప్రతి చిన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొంతమంది ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆక్రమణలను గుర్తించడంతోపాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశాల మేరకు ఎటువంటి ఫిర్యాదులు, సమస్యలు లేని భూములు, ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఎసెస్‌మెంటు కోసం దరఖాస్తు చేసుకొవచ్చునన్నారు. ఎస్సీ కులస్తులకు ప్రత్యేకంగా శ్మశాన వాటికలు లేనిచోట స్థలం గుర్తించాలని సూచించారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన నివేదికల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయంలో వీఆర్వో, సర్వేయర్లు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌కు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూ కన్వర్షన్ లేకుండా పలు ప్రాంతాల్లో కట్టడాలు చేస్తున్నారని, వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ఈ విషయమై ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదులు కూడా చేసినట్టు గుర్తు చేశారు. ప్రధానంగా సింగులపురం, జాతీయ రహదారి పరిసరాల్లో భూములకు కన్వర్షన్ లేకుండా కట్టడాలు చేస్తున్నారని.. వీఆర్వోలు దృష్టిసారించాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ బి.వి.వి.ఎస్.రాజు, డీటీ సాధు శంకరరావు ఉన్నారు.

తిరుగు ప్రయాణంలో జనం



రణస్థలం : రణస్థలంలో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

రణస్థలం/లావేరు: సంక్రాంతి సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన వారంతా బుధవారం తిరుగు పయనమయ్యారు. ఉద్యోగులు, వలస కూలీలు, అల్లుళ్లు, బంధువులతో సుమారు వారం రోజులు గ్రామాలన్నీ కళకళలాడాయి. అయితే సంక్రాంతి పూర్తి కావడం, పాఠశాలలకు పండుగ సెలవులు ముగియడంతోపాటు గురువారం నుంచి తెరచుకుంటున్న నేపథ్యంలో అందరూ తిరుగు పయానమయ్యారు. దీంతో లావేరు, రణస్థలం మండలాల్లోని పలు గ్రామాల కూడళ్లు సంక్రాంతికు వచ్చి వెళ్లిపోతున్నవారితోనే కనిపించాయి.

ప్రయాణికులతో కాంప్లెక్స్ కిటకిట

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన బంధువులు, చుట్టాలు, కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణ కోసం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బుధవారం చేరుకున్నారు. దీంతో ప్రయాణికులతో కాంప్లెక్స్ పరిసరాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరుతూ కనిపించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు అందుకు తగ్గ బస్సులను ఏర్పాటు చేశారు.



లావేరు: సుభద్రాపురం జంక్షన్‌లో బస్సుల కోసం వేచి ఉన్న జనం



శ్రీకాకుళం అర్బన్: ప్రయాణికులతో రద్దీగా ఉన్న కాంప్లెక్స్

ముగిసిన పైడితల్లి అమ్మవారి జాతర





జాతరకు తరలివచ్చిన జనం (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

జి.సిగడాం: గెద్దకంచరాం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పైడితల్లి అమ్మ వారి జాతర మహోత్సవాలు బుధవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా జి.సిగడాం ఎస్సై సామంతుల రామారావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉపాధి వేతనదారులకు బీమా సౌకర్యం



పనులు పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

గార: ఉపాధి హామీ పథకం వేతనదారులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. శ్రీకూర్మం గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ.. ఆహార భద్రతతో పాటు జీవన భద్రతను కూడా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వంద రోజులు పని పూర్తిచేసేలా చూడాలన్నారు. రోజుకి రూ. 257 గరిష్ట వేతనం అందుకోవడం కోసం ఆరుగంటలు పాటు పనిచేయాలన్నారు. పనులు నాణ్యతతో చేపడితే వాటి ఫలాలు గ్రామస్తులకే చేరువవుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో సంధ్యారాణి, జేఈ నారంనాయుడు ఉన్నారు.

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి నది ఒడ్డున ఉన్న దత్తక్షేత్రంలో దత్తాత్రేయునికి బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అనఘాసమేతదత్తత్రేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. దత్తస్వామిని ఇష్టమైన ఔదంబర పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

త్రిపుర సుందరీదేవి ఆలయంలో..

ఎచ్చెర్ల: తమ్మినాయుడుపేటలోని లలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో బుధవారం ఆసిరితల్లి సమేత లలితా అమ్మవారికి ఘనంగా పూజలు జరిగాయి. పంచామతాభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజలను నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసరాజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు శ్రీపాదసురేష్ శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.

అల్లినగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. రోడ్లపై చెత్తను తొలగించి గ్రామానికి దూరంగా ఉన్న డంపింగ్ యార్డుకు తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు.

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారుల హాజరుకు అవకాశం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ దైవప్రసాద్, శ్రీకాకుళం ఈఈ బయ్యన్నాయుడు

అరసవల్లి: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. దీని కోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పనివేళల్లోనే బహిరంగ విచారణ కార్యక్రమం జరుగనుంది. ఇందుకోసం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్/డివిజనల్ కార్యాలయంతో పాటు టెక్కలి, పాలకొండ డివిజన్ల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు ఆయా పరిధిలోని వినియోగదారులు హాజరై వారి అభిప్రాయాలను, చార్జీల ప్రతిపాదనలపై సూచనలను చేయవచ్చు. దీంతో పాటు 'ఏపీఈఆర్‌సీపబ్లిక్‌హియరింగ్' వెబ్ లింక్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలియజేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీకాకుళంలోని సర్కిల్ కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ మాట్లాడుతూ.. సర్కిల్ కార్యాలయంతో పాటు పాలకొండ, టెక్కలి ఈఈ కార్యాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

మంత్రి ధర్మాన పరామర్శ



పరామర్శలో మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

గార: ఆరంగిపేట గ్రామానికి చెందిన ఆరంగి చిన్నవాడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలియడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. అలాగే మండల కేంద్రమైన గారకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్పు దుర్గాప్రసాద్ అనారోగ్యపాలవ్వడంతో పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట ఎంపీపీ గొండు రఘురామ్, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ మార్పు పృధ్వీరాజ్, ఎంపీటీసీ సభ్యుడు ఆరంగి రమణమూర్తి ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీఐ ఆదాం



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ ఆదాం తదితరులు

జి.సిగడాం: గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రణస్థలం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదాం అన్నారు. అపరిచితులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గెద్దకంచరాం గ్రామంలోని పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా బందోబస్తును పర్యవేక్షించేందుకు బుధవారం వచ్చిన ఆయన ప్రజలకు, వాహనదారులకు పలు సూచనలు చేశారు. జాతర్ల సమయంలో అపరిచితులు సంచరిస్తుంటారని.. వారిపట్ల అప్రమతంగా ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఆయనతో పాటు ఎస్సై ఎస్.రామారావు, సిబ్బంది ఉన్నారు.

రిమ్స్ నిత్యన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: సూర్య భూషణ్ ట్రస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ ద్వారా విశేష సేవలు అందించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ దాసుబాబు అని రాష్ట్ర శిష్టకరణ సంఘ అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. దాసుబాబు ద్వితీయ వర్ధంతి సందర్భంగా రిమ్స్‌లోని సత్యసాయి అన్నపూర్ణ సేవ సంస్థ నిర్వహిస్తున్న నిత్యన్నదాన సేవా పథకానికి అతని కుటుంబ సభ్యులు రాజేష్, ప్రభులు 7,116 రూపాయల విరాళం అందించారు. దాసుబాబు సేవలను వక్తలు కొనియాడారు. అఖిల భారత శిష్ట కరణ సంఘం కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, బి.వి.ఎస్.ఎస్.ప్రభు, దాసుబాబు సోదరులు రాజేష్, మనోజ్, పొలుమహంతి జగన్ మోహనరావు, వాసు, బలివాడ ప్రశాంత్, అన్నపూర్ణ సేవ సంఘం, రెడ్ క్రాస్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వల్లభ నారాయణస్వామి రథోత్సవం



వల్లభ నారాయణస్వామి రథోత్సవం జరుగుతున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం రూరల్: నైరా గ్రామంలో వల్లభ నారాయణస్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు జరిగాయి. స్వామివారి నిజరూప దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పురోహితులు జోస్యుల నర్సింహమూర్తి, భద్రం ఆదిత్య, అరవింద్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు కర్రి కృష్ణమోహన్, రామప్రతాప్, అరవల రవీంద్రబాబు పాల్గొన్నారు. కాగా రథోత్సవంలో భాగంగా కోడెబలుల ఉత్సవం ఆకట్టుకుంది. సాయంత్రం ఆరు గంటల నుంచి ఉత్సవ విగ్రహాలతో గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.